సజ్జను దెబ్బతీసిన వర్షం

- కొన్నిచోట్ల పంట కోతకు వచ్చే సమయం
- ఇంకొన్ని చోట్ల కోసిన కంకులకు బూజు!


కోతకు వచ్చిన కంకులతో సజ్జ పంట

రొంపిచర్ల: మండలంలో ప్రస్తుత తరుణంలో సాగు చేసిన సజ్జ పంటకు వర్షాలు తీవ్ర అడ్డంకిని కలిగిస్తున్నాయి. మండలంలో ఈ ఏడాది తొలకరిలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు రైతులు కొద్ది విస్తీర్ణంలో నామమాత్రంగా సజ్జ పైరు సాగు చేశారు. ఈ సజ్జ పైరు మండలంలోని వి.రెడ్డిపాలెం, విప్పర్ల గ్రామాల్లోని ముగ్గురు రైతులు నామ మాత్రంగా ఆరు ఎకరాల్లో పంట వేశారు. అయితే పంట మొక్క మొలిసినప్పటి నుంచి పడుతున్న కొద్దిపాటి వర్షాలకు పంట ఏపుగా పెరిగింది. పంట తరుణం వచ్చి కంకులు కూడా వచ్చాయి. అయితే పంట కోతకు వచ్చే సమయంలో వర్షాలు ప్రారంభమయ్యాయి. ముందుగా సాగు చేసిన ఇరువురు రైతులు కంకులు కోసి కల్లాల్లో ఉంచారు. కంకులు కోసిన తర్వాత ఒకటి రెండు రోజులు ఎండలు తగలటం మినహా వర్షాలు ప్రారంభమయ్యాయి. వర్షాలకు తడవకుండా కల్లాల్లో ఉన్న కంకులను రాశులు చేసి తడవ కుండా కప్పి పెట్టారు. మరో రైతు సజ్జ కంకులు కోసేందుకు నాలుగు రోజులు సమయం ఉందనుకుంటున్న తరుణంలో వర్షాలు ప్రారంభమయ్యాయి.

అయితే కోయకుండా ఉన్న కంకులు చేలోనే నిలువు తడుస్తుండగా కోసి రాశులు చేసిన కంకులు ఎండ తగలక బూజు పడుతూ మగ్గుతున్నాయి. సోమవారం వర్షం శాంతించి ఓ మోస్తరు ఎండలు కాయటంతో రాశుల్లో ఉన్న కంకులను రైతులు ఆరబెట్టే పనుల్లో నిమజ్జమయ్యారు. మరో రెండు రోజుల పాటు వరుపు వాతావరణం నెలకొంటే నిలువులో ఉన్న సజ్జ కంకులను కూడా కోత కోసే పని పడుతుంది.


కల్లాల్లో ఆరబెట్టిన రైతులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఈపూరు: మండలంలోని అన్ని సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నరసరావుపేట రూరల్ ఏడీఈ బి.వెంకటేశ్వరరెడ్డి, ఈపూరు ఏఈ గాంధీ తెలిపారు. సబ్ స్టేషన్‌ల పరిధిలోని మెయింటెనెన్స్‌లో భాగంగా నెలసరి మరమ్మతులు నిమిత్తం విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు, ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ ఉదయం 3గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో అన్ని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఇ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం సందర్భంగా పిడుగురాళ్ళలో గల 220/132/33 కె.వి.విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. మండలంలో అన్ని గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. 3 ఫేస్ విద్యుత్ శనివారం తెల్లవారుజామున 12 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

చిలకలూరిపేటలో....

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని పురుషోత్తమ పట్నం, అడ్డరోడ్డు సెంటర్, శాంతినగర్, మార్కెండేయ నగర్, భవనారుషి నగర్, సుగాలీకాలనీ, ఆది ఆంధ్రాకాలనీ ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా చిలకలూరిపేట మండల పరిధిలోని మద్దిరాల, పసుమర్రు, యడవల్లి, బొప్పూడి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నాదెండ్ల మండల పరిధిలో పలు గ్రామాలలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులను పురస్కరించుకొని శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై.ఏడుకొండలు శుక్రవారం పేర్కొన్నారు. పట్టణంతో పాటు నరసరావుపేట మండలంలోని అన్నీ గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

క్లుప్తంగా

విద్యార్థుల కోసం బస్సు నడపాలి

నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ పాఠశాలకు బుక్కాపురం, రాజుగారిపాలెం మీదుగా బస్సు సర్వీసు నడపాలని కోరుతున్నారు. ఈ మేరకు నరసరావుపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు శుక్రవారం విజ్ఞాపన పత్రం అందించారు. గతంలో ఎండుగుంపాలెం గ్రామానికి నరసరావుపేట డిపో నుండి 9 ట్రిప్పులు నడిపేవారని, ప్రస్తుతం అధికారులు 6 ట్రిప్పులు మాత్రమే పరిమితం చేశారని వాపోయారు. హైస్కూలు వెళ్లి వచ్చేందుకు వీలుగా ఉండే ఉదయం 9, సాయంత్రం 4 గంటల ట్రిప్పులు రద్దు చేశారని, దీంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తప్పటం లేదన్నారు. ఈ రెండు ట్రిప్పులు లేని కారణంగా సుమారు 80 మంది విద్యార్థులు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు 6–10 కిలోమీటర్లు నడవాల్సి వస్తున్నదని వాపోయారు. వర్షాకాలంలో తమ బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని విద్యార్థులు వాపోయారు. తమ చదువులు సజావుగా సాగేందుకు ఉదయం 8 గంటలు, సాయంత్రం 4 గంటలకు ట్రిప్పులు నడపాలని కోరారు.

టాయిలెట్స్ ఫొటో క్యాప్చరింగ్

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం పాఠశాలల్లో టాయిలెట్స్ ఫొటోలను తీసి పంపడంపై ఈ సమీక్షలో వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో షేక్ గౌసియా బేగం మాట్లాడుతూ ప్రతిరోజూ ఆయా పాఠశాలల్లో టాయిలెట్స్ ఫోటోలను తీయాలని, పై అధికారులకు వాటిని పంపాలని సూచించారు. సమీక్షలో పంచాయతీ, సంక్షేమ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫోర్‌బాల్ పోటీలకు కారుమంచి విద్యార్థి



శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన మల్లపరపు వినయ్‌కుమార్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా ఫోర్ బాల్ సంఘ కార్యదర్శి యం.కిషోర్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల 1న నరసరావుపేట ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన 18వ అండర్–19 బాల బాలికలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఈనెల 26, 27, 28, 29 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలోని చంగల్‌పట్టులో జరిగే జాతీయస్థాయి ఫోర్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మల్లపరపు వినయ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించి వారి తల్లిదండ్రులను ప్రోత్సహించినట్లు తెలిపారు.

ఆర్ఎస్‌కే సిబ్బందికి శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో వినుకొండ సబ్ డివిజన్‌లోని రైతు సేవా కేంద్ర సిబ్బందికి నైపుణ్య పెంపుదలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా శిక్షణ కోఆర్డినేటర్ ఎం.శివకుమారి పాల్గొని మాట్లాడుతూ కందిలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. వెర్రి తెగులు వచ్చే అవకాశం ఉందని కనుక విత్తనం 30 రోజులకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు, 60- 65 రోజులకు రపోపర్ గైట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ఎండు తెగుళ్లు రాకుండా అభివృద్ధి చేసిన టి.విరిడే వాడాలన్నారు. ఏరువాక శాస్త్రవేత్త వెంకట్రాములు వరి పంటలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రైతులు ఆకుముడత కనబడగానే మందులు వాడుతున్నారని, చిరుపొట్ట దశ వరకు దీని గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవిబాబు, ఏవో ప్రవీణ్, వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని విష్ణుకుండినగర్ ఫస్ట్ లైన్‌లో మరోసారి చెలరేగిన చైన్ స్నాచర్స్. సేకరించిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన దావులూరి వాణి గురువారం రాత్రి 8 గంటల సమయంలో స్కూల్ నుంచి పిల్లలను తీసుకొని వచ్చి ఎదురు ఇంటి మహిళతో మాట్లాడుతుండగా మెరుపు వేగంతో బైక్ మీద గుర్తుతెలియని వ్యక్తి వచ్చి వాణి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని పారిపోవడం జరిగింది. స్థానికులు అందరూ వెంటపడగా దొంగ పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులను ఆదుకోవాలి

చిలకలూరిపేట: వరదబాధితులకు ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట మాజీ అధ్యక్షుడు తొట్టెంపూడి వెంకటేశ్వరరావు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో రూ. 1.35 లక్షల విలువైన నిత్యావసర సరకులను వరద బాధిత ప్రాంతాలకు శుక్రవారం పంపిణీ చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురైన బొబ్బర్లంక, పెనుమూడి, పల్లెపాలెం, చింతమోటు గ్రామాలలో పంపిణీ చేసేందుకు ఈ నిత్యావసర సరుకులు పంపుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు టి.వెంకటనారాయణ, గల్లా సాంబశివరావు, ఆళ్ల వేమనరెడ్డి పాల్గొన్నారు.

గణితశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని గుడ్‌షఫర్డ్ స్కూల్లో డాక్టర్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో గణిత శాస్త్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలో గణిత శాస్త్రానికి గల ప్రాముఖ్యతను వివరించారు. గణిత శాస్త్రం ప్రమేయం లేకుండా ఏ శాస్త్రం లేదని తెలిపారు. గణితంపై మక్కువ చూపే విద్యార్థుల భవిష్యత్ బంగారుమయం అవుతుందన్నారు. ఈ సదస్సులో 30 గణిత నమూనాలు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సులభంగా మేథ్స్ సాధన చేసే పద్ధతులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.లక్ష్మీ సునీత, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, యశోదరావు, నరసింహారావు, నిర్మల, నాగలక్ష్మి పాల్గొన్నారు.


నమూనాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇక నుంచి సొసైటీల్లో ఆన్‌లైన్ సేవలు

కారుమంచి సొసైటీ సీఈవో నారాయణ

శావల్యాపురం: వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని (సొసైటీ) రైతులకు ఇక నుంచి డిజిటలైజేషన్ (ఆన్‌లైన్) విధానంలో అన్నీ రకాల సేవలు అందుబాటులో వస్తాయని కారుమంచి సొసైటీ సీఈవో వై.వి.నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2047 సొసైటీ కార్యాలయాలు ఉన్నాయని అక్టోబరు నెలఖారు నాటికి నూరుశాతం ఆన్‌లైన్ విధానంలో ఆర్థిక లావాదేవీలు కొనసాగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టులో పల్నాడు జిల్లాలో శావల్యాపురం, ఈపూరు సొసైటీలను ఎంపిక చేయగా ఇప్పటి వరకు 70 శాతం రైతుల సమగ్ర వివరాలతో కూడిన సమాచారం ఆన్‌లైన్ పొందుపరిచినట్లు తెలిపారు. కారుమంచి సొసైటీ పరిధిలో 3351 మంది రైతులు ఉండగా 1548 మంది రైతులు అప్పుదారులుగా ఉన్నట్లు తెలిపారు. రూ.50 కోట్లు నిధులు రైతులకు రుణాల రూపంలో మంజూరు చేయగా, మహిళా సంఘాల్లోని గ్రూపు సభ్యులకు రూ.10 కోట్లు రుణాలను తక్కువ వడ్డీ రేటుకు ఇచ్చినట్లు తెలిపారు. 50 శాతం రైతుల సమగ్ర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. సొసైటీల్లోని రైతుల సమగ్ర వివరాలు ఆన్‌లైన్ విధానం చేయటం ద్వారా రుణాలు మంజూరు తదితర సేవల్లో అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా రైతులకు సేవలు అందుతాయన్నారు. అక్టోబరు 2న పైలట్ ప్రాజెక్టులో ఎంపికైన సొసైటీల్లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం అవుతాయన్నారు. మిగిలిన వాటిల్లో కూడా అక్టోబరు నెలఖారులోగా ఆన్‌లైన్ సేవలు నూరుశాతం అందుబాటులోకి వస్తాయని సొసైటీ సీఈవో నారాయణ తెలిపారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేహదారుఢ్యం

- 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ నాయబ్ సుబేదార్ రేఖారామ్
- ఉత్సాహంగా ఎన్‌సీసీ సెలక్షన్స్

నరసరావుపేట ఈస్ట్: ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, దేహదారుఢ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ నాయబ్ సుబేదార్ రేఖారామ్ తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాలలో ఎన్‌సీసీ సెలక్షన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా రేఖారామ్ మాట్లాడుతూ, పారా మిలటరీ విభాగంగా ఉన్న ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ పొందవచ్చని వివరించారు. సమాజానికి తద్వారా దేశానికి సేవ చేసే అవకాశం ఎన్‌సీసీ ద్వారా కలుగుతుందని తెలిపారు. ఎన్‌సీసీ ఎంపికకు 115 మంది బాల బాలికలు హాజరు కాగా వారిలో 75 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ వై.అంజిరెడ్డి, బెటాలియన్ హవల్దార్ షంషేర్‌సింగ్ పాల్గొన్నారు.


విద్యార్థినులను ఎంపిక చేస్తున్న ఆఫీసర్లు

నరసరావుపేటలో అరుదైన శస్త్ర చికిత్స

మహిళ పేగులో నుంచి గాజు ముక్కలు తొలగింపు

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని శకుంతల గ్యాస్ట్రోలివర్ కేర్ హాస్పిటల్‌లో గురువారం డాక్టర్ ఐలా శ్రీనివాస్ అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రమాదవశాత్తు గాజు ముక్కలు మింగిన రెంటచింతలకు చెందిన నాగలక్ష్మి బుధవారం హాస్పిటల్‌లో చేరారు. ఆమెకు పరీక్షలు చేసిన డాక్టర్ చిన్నప్రేగులో గాజుముక్కలు ఉన్నట్లుగా గుర్తించి ఎండోస్కోపీ విధానంతో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి ఆ గాజుపెంకులను బయటకు తీసినట్లు హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ దత్ శుక్రవారం తెలిపారు. ఆ మహిళ క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు.


బాధితురాలు నాగలక్ష్మితో డాక్టర్ శ్రీనివాస్

ప్రజా పోరాట యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి

- సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ
- ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు

నరసరావుపేట: ప్రజా పోరాట యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని, ఆయన అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఏచూరి సంతాపసభ నిర్వహించారు. సీనియర్ నాయకులు కామినేని రామారావు అధ్యక్షత వహించగా, మరో సీనియర్ నాయకులు ఏవీకే దుర్గారావు ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయకుమార్ మాట్లాడుతూ పార్టీ నాయకునిగా ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో, బహిరంగ సభల్లో పాల్గొని కార్యకర్తలలో వామపక్షభావాలను రేకెత్తించి ఉత్తేజ పరిచి ఉద్యమాలకు దిశా నిర్దేశం చేశారన్నారు. సంతాప సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

నాదెండ్ల: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి సుమారు 42 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సాతులూరు చెరువు సమీపంలో గురువారం అర్ధరాత్రి పోలీసులు కాపుకాసి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నరసరావుపేట రూరల్ మండలం దొండపాడు గ్రామం నుంచి సాతులూరు మీదుగా నరసరావుపేట వైపు తరలిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులను చూసి వాహన డ్రైవర్, వాహనంలోని కూలీలు పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయంలో అందుబాటులో ఉండండి



వినుకొండ(నూజెండ్ల): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో తహసీల్దార్ సురేష్‌నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ప్రజలకు సచివాలయంలో అందుబాటులో ఉండాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు అందించు విషయంలో ఎటువంటి జాప్యం జరగరాదని తెలియజేశారు. సీసీఆర్సీ కార్డులు, పీజీఆర్సీ, మీసేవ, సచివాలయ, ఇతర రెవెన్యూ సేవల విషయంపై ఆయన సమీక్షించారు.

తిరుమల కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



నరసరావుపేట రూరల్: తిరుమల కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులకు హైద్రాబాద్‌కు చెందిన జెన్‌ట్రీ ల్యాబ్స్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ శుక్రవారం తెలిపారు. ఈనెల 10వ తేదీన జెన్‌ట్రీ ల్యాబ్స్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3 లక్షలు ఇస్తారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

గుడ్-బ్యాడ్ టచ్‌లపై అవగాహన

నాదెండ్ల: విద్యార్థి దశ భవిష్యత్‌ను నిర్ణయించుకునే దశ అని యడ్లపాడు ఎస్ఐ వి.బాలకృష్ణ చెప్పారు. యడ్లపాడులోని సెయింట్ ఆన్స్ హైస్కూలులో 8,9,10 తరగతుల విద్యార్థులతో భవిష్యత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ హైస్కూలులో 8–10 వరకూ 120 మంది విద్యార్థులు ఉన్నారని, మంచి, చెడు అలవాట్లు, క్రమశిక్షణ, సమయపాలన, భవిష్యత్ ప్రణాళిక, లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వలేటి శివకృష్ణ



శావల్యాపురం: వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నందున పొలాలకు పెట్టుబడులు నిమిత్తం అర్హత కల్గియున్న స్వయం సహాయక మహిళా గ్రూపులకు రుణాలను మంజూరు చేసినట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వలేటి శివకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక బ్రాంచ్ పరిధిలో మహిళా గ్రూపుల్లోని సభ్యులకు రుణాలు మంజూరు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించటానికి ఈ రుణాలు ఎంతో దోహదపడతాయన్నారు. రుణాలు సకాంలో చెల్లింపులు చేసిన మహిళా సభ్యులకు వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. అనంతరం మండలంలోని కనమర్లపూడి గ్రామంలోని ఒక్కొక్క గ్రూపునకు రూ. 20 లక్షల చొప్పున ఐదు గ్రూపులకు రూ. కోటి రూపాయలు రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ దీలిప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు

నాదెండ్ల: యడ్లపాడు మండలం వంకాయలపాడు, ఉప్పరపాలెం గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్న సమాచారంతో అధికారులు వెళ్లి వివాహాలను నిలుపుదల చేయించారు. మండల ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో హనుమారెడ్డి, ఎస్సై బాలకృష్ణ, ఈవోపీఆర్డీ వరుదిని, ఆర్ఐ చక్రవర్తి, ఏవో సాయి శ్రీనివాస్, ఐసీడీఎస్ అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లారు. వధువు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలను వివరించారు. మైనార్టీ తీరాకే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు.


వంకాయలపాడులో వధువు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

లింగారావుపాలెంలో హిందీ దినోత్సవం

నాదెండ్ల: యడ్లపాడు మండలం లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ హిందీ జాతీయ భాష అని, దేశ సమైక్యతకు హిందీ భాష దోహదపడుతుందన్నారు. ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో హిందీ ఒకటన్నారు. భారతదేశంలో వందలాది భాషలున్నాయని, అయితే జాతీయ భాషగా హిందీ దేశ ప్రజలందరి మాధ్యమంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హిందీని ఆదరించాలన్నారు. అనంతరం హిందీ దివస్ ఆకారంలో విద్యార్థులు నిల్చుని ప్రదర్శించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు రామాంజనేయులు, శ్రీనివాసరావు, విజయ్ శామ్యూల్, శైలజ, మేరీశౌరీలు, గ్రామ పెద్దలు ఎస్ శివ రామకృష్ణయ్య, టి సత్యనారాయణ ఉన్నారు.


హిందీ దివస్ ఆకారంలో విద్యార్థులు

మూడుసార్లు బయోమెట్రిక్ తప్పనిసరి

సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో ఆదేశం

నరసరావుపేట రూరల్: సచివాలయ సిబ్బంది ప్రతి రోజు మూడుసార్లు బయోమెట్రిక్ హాజరు తప్పని సరిగా వేయాలని ఎంపీడీవో నాగిశెట్టి వెంకటేశ్వర రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి అధికారుల అనుమతి లేకుండా వ్యక్తిగత సెలవులు మంజూరు చేయవద్దని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, రోడ్ల వెంట ఉన్న వ్యర్థాలను తొలగించాలన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి అన్ని గ్రామాల్లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని వందశాతం అమలు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు రెండవ శనివారం సెలవును రద్దు చేసినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు

జై జై గణేశా.. బై బై గణేశా...

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విగ్రహ ఊరేగింపులో విద్యార్థునుల కోలాటం, నృత్యాలు, భజనలతో ఘనంగా ఊరేగించారు. మెయిన్ క్యాంపస్‌లోని వినాయకుడి ఊరేగింపు కోలాహలంగా నిర్వహించారు. వినాయకుని లడ్డూలను వేలం వేయగా బూదాలి రమేష్ రూ.15 వేలకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస్‌శర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: మండలంలో వినాయకుడి నిమజ్జనాలు శుక్రవారం కొనసాగాయి. మండల పరిధిలో 15 విగ్రహాలకు గాను గణపవరంలో మూడు, నాదెండ్ల 2, సాతులూరు 2, జంగాలపల్లె 1 చొప్పున విగ్రహాలకు నిమజ్జనం చేశారు. విగ్రహాల నిమజ్జనంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. గణపవరం శాంతినగర్‌లో ట్రెండ్‌సెట్టర్స్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహం వద్ద అన్నదానం చేశారు. సోమవారం నిమజ్జనం చేయనున్నారు.


గణనాథుడిని ఊరేగిస్తున్న నిర్వాహకులు

హత్య కేసులో నిందితుల అరెస్టు

వినుకొండ: బొల్లాపల్లి మండలం గండిగనుమల తండాకు చెందిన రవినాయక్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం వినుకొండ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6న బొల్లాపల్లి మండలం బ్రిడ్జితండాకు చెందిన రవినాయక్‌ను హత్య చేసి సాగర్ కెనాల్‌లో పడేసినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు.